క్లుప్తంగా

మద్యం షాపుల మూసివేత



మూతపడిన మద్యం షాపుల వద్ద ఎక్సైజ్ సిబ్బంది

ఆకివీడు: ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ఈ నెల ఐదో తేదీన జరుగనున్న నేపథ్యంలో మద్యం షాపులను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 48 గంటల ముందుగా మూసి వేసి డ్రైడేలుగా పాటిస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు సర్కిల్ పరిధిలో 23 మద్యం షాపులను మూసివేసి, సీలు వేశామన్నారు. ఐదో తేదీ సాయంత్రం నాలుగు గంటల తరువాత తెరుస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై వి.కరుణప్రియ, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూతనందించాలి



మానసిక వికలాంగుల కేంద్రంలో మాట్లాడుతున్న యోహాన్

భీమవరం: దివ్యాంగులకు అవసరమైన చేయూతనందిస్తే సమాజంలో విభిన్న రంగాల్లో ప్రతిభావంతులుగా రాణిస్తారని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్ అన్నారు. మంగళవారం ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉండి రోడ్డులోని భవిత మానసిక వికలాంగుల కేంద్రాన్ని సందర్శించి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా యోహాన్ మాట్లాడుతూ దివ్యాంగులను చులకనగా చూడకూడదని వారి పట్ల ప్రేమతో మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, ప్యానల్ న్యాయవాదులు బి.సురేష్ కుమార్, ఎస్.సుధీర్, పి.అంబేద్కర్, ఎంబీ భవాని తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులను గౌరవించుకోవాలి



భీమవరంలో న్యాయవాది కల్పనను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: సమాజంలో సామాన్యులకు న్యాయం అందించడానికి న్యాయవాదులు కీలక పాత్ర వహిస్తున్నారని అలాంటి న్యాయవాదులను గౌరవించుకోవల్సిన బాధ్యత మనపై ఉందని ఆల్ బీసీ ప్రజాసంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నరమామిడి గంగారామ్ అన్నారు. మంగళవారం భీమవరంలో ప్రపంచ న్యాయవాదుల దినోత్సవం సందర్భంగా బీసీ సంఘాల లీగల్ అడ్వైజర్ సూరిశెట్టి కల్పనను సత్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాది కల్పన మాట్లాడుతూ నిరుపేదలకు, సామాన్యులకు న్యాయం అందించడంలో కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు కొమ్మోజు కన్నబాబు, కొమ్మోజు వాసు, ధనాల కోట విజయసావిత్రి, మామిడి శెట్టి శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల విద్యపై అవగాహన



సమగ్ర శిక్షా అభియాన్ పీడీ శ్యామ్‌సుందర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: కుటుంబంలో స్త్రీ విద్యావంతురాలైతే ఆ కుటుంబం అంతా విద్యావంతులే అవుతారని సమగ్ర శిక్షా అభియాన్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ పి శ్యాంసుందర్ అన్నారు. మంగళవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారిక విభాగం తెలుగు, ఇంగ్లిష్, కంప్యూటర్ సైన్స్ వారి సహకారంతో నేషనల్ జెండర్ క్యాంపెయిన్ నయి చేతన్ 3.0లో భాగంగా బాలికల విద్యపై అవగాహనా సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ ఆడపిల్లలకు సమాజంలో చదువుతోపాటు, పౌష్టికాహారాన్ని అందించే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. అలాగే నేటి సమాజంలో జరిగే అరాచకాలను దృష్టిలో పెట్టుకుని గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌ల గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ భద్రాచలం, అధ్యాపకులు ఎస్.దినకరన్, జీడీ శ్రీనివాస్, సీహెచ్ రవికుమార్ పాల్గొన్నారు.

కళాశాలలో సేవ్ వాటర్ సేవ్ లైఫ్

ఏఎస్ఎన్ఎం కళాశాలలో మంగళవారం వృక్ష శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జలశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా సేవ్ వాటర్ సేవ్ లైఫ్ అనే అంశంపై అవగాహన కల్పించారు. నీటి సంరక్షణ ఉపయోగాలను వివరించారు.

అసంపూర్తిగా వంతెన నిర్మాణాలు

- రూ.కోట్ల ప్రజాధనం వృథా
- నిరుపయోగంగా వంతెనలు

ఉండి: నియోజకవర్గ కేంద్రం ఉండి అభివృద్ధికి ఆమడ దూరం నిలుస్తుంది. దీనికి కారణం పలు కట్టడాలు మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రజాధనం వృథా అయిపోతుంది. ప్రజల సొమ్ము లక్షలు, కోట్లలో వెచ్చించి నిర్మాణాలు చేపట్టిన భారీ వంతెనలు నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రజలు, రైతులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. పేరుకే నియోజకవర్గ కేంద్రంగా ఉండి నిలుస్తుంది కానీ అభివృద్ధిలో మాత్రం అంతంత మాత్రమే అన్నట్టు ఉంది. నియోజకవర్గ కేంద్రంలో చేపట్టిన నిర్మాణలు మధ్యలోనే ఆగిపోవడంతో అవి కేవలం అలంకార ప్రాయంగానే కనిపిస్తున్నాయి.

ఉపయోగం లేని అసంపూర్తి నిర్మాణాలు

దీనిలో మొదటిది మండలంలోని యండగండి, గణపవరం మండలం ఎస్ కొండేపాడుకు వెళ్ళేందుకు యనమదుర్రు డ్రెయిన్‌పై భారీ ఎత్తున నిర్మాణం చేపట్టిన వంతెన. ఇది మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రజాధనం పెద్ద ఎత్తున వృథాగా మారింది. ఈ మార్గంలో యండగండి, కొండేపాడు గ్రామాల మీదుగా అత్తిలి, తణుకు, రాజమండ్రి వంటి సుదూర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాత రహదారి



కలిసిపూడిలో ఉండి కాలువపై అసంపూర్తిగా ఉన్న వంతెన



యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయిన వంతెన

వర్షాకాలంలో యనమదుర్రు ప్రవాహానికి పూర్తిగా మునిగిపోతుంది. దీంతో వాహనదారులు ఇతర మార్గాలు వెదుక్కుని వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది. స్థానిక రైతులు కూడా కొండేపాడు పొలాలకు వెళ్లాలంటే వర్షాకాలం దారి లేకపోవడంతో వ్యవసాయంలో తీవ్ర నష్టాలు చవి చూడాల్సి వస్తుంది. అప్రోచ్ రోడ్లు నిర్మాణం చేస్తే ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నా ప్రజా ప్రతినిధులు పట్టించుకోపోవడంతో వృథాగా మారుతుంది. కలిసిపూడి, చెరుకువాడ గ్రామాల మధ్యలో ఉండి కాలువపై సుమారు రూ.30 నుంచి రూ.40 లక్షల అంచనాతో నిర్మాణం తలపెట్టిన వంతెన అప్రోచ్ రోడ్డు లేక నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది. అప్రోచ్ రోడ్డు చేపడితే స్థానిక రైతులు, ప్రజలకు వంతెన ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

అసలు ఇలా ఎందుకు కట్టారు ?



కలిసిపూడి, యండగండిలో నిర్మించిన వంతెనలు అసలు ఎందుకు కట్టారు ? నిర్మాణం ఎలా పూర్తి చేద్దామనుకున్నారో ? అర్థం కావడం లేదు. అటు రైతులకు, ఇటు వాహనదారులకు కూడా ఉపయోగపడే స్థితిలో లేదు.

–గుండాబత్తుల సుబ్బారావు, ఉండి

ఎత్తుగా కట్టిన వంతెన



యండగండి కొండేపాడు మధ్యలో యనమదుర్రు డ్రెయిన్‌పై చేపట్టిన వంతెన నిర్మాణం చాలా ఎత్తుగా ఉంటుంది. దానిని అలా ఎందుకు కట్టారో ఇప్పటికీ తెలియని పరిస్థితి ఉంది. అంత భారీగా కట్టిన వంతెన మధ్యలోనే నిలిచిపోవడం బాధనిపిస్తుంది. దీంతో పాటు వర్షాకాలంలో రెండు ప్రాంతాలకు మధ్య రహదారి ఉండదు. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం.

–వెలగపల్లి టోనీ, యండగండి

నేడు యూపీఎఫ్ ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకలు

ఉండి: మండలంలోని పాస్టర్స్ ఫెలోషిప్ (యుపీఎఫ్) ఫ్యామిలీ క్రిస్మస్ వేడుకను చెరుకువాడ క్రీస్తు సంఘం కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు సోడదాసి పీటర్, వై.యోనాతాను తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులులు, వర్తమానికులుగా ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రధాన కార్యదర్శి బ్రదర్ మేడిద జాన్సన్ హాజరవుతున్నట్లు తెలిపారు. అలాగే బ్రదర్ రాపాక రత్నరాజు, బిషప్ ఎం.జోహన్నస్ ప్రేమ్‌కుమార్, రెవరెండ్ ఎ.శ్యాంబాబు హాజరవుతున్నట్లు వారు తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి నారాయణరావు ప్రచారం

భీమవరం: ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్టీయూ, ఏపీటీఎఫ్, పీఈటీ తదితర సంఘాలు బలపర్చిన గంధం నారాయణరావు పట్టణంలో మంగళవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల, ఝాన్సీలక్ష్మీభాయి స్కూల్, కేజీఆర్ఎల్ కళాశాల, జీటీపీటీ, పొట్టి శ్రీరాములు మునిసిపల్ గరల్స్ హైస్కూల్ తదితర విద్యా సంస్థల అధ్యాపకులు, ఉపాధ్యాయులను కలిసి తనకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, చెల్లబోయిన రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

సంకల్పంతో వైకల్యాన్ని జయించాలి



ఆకివీడు: విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం



ఉండి: దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఆకివీడు: సంకల్పం ముందు వైకల్యం పరాజయం పొందక తప్పదని దివ్యాంగ ఉపాధ్యాయురాలు మార్తమ్మ అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి హెచ్ఎం తోట పోతరాజు అధ్యక్షత వహించారు. సభలో మార్తమ్మ మాట్లాడుతూ ఉపాధ్యాయురాలిగా పని చేసేందుకు తనకు దివ్యాంగత్వం అడ్డు రాలేదన్నారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణ, లక్ష్యం సాధించాలనే తపన ఉంటే ఏదైనా సాధించొచ్చన్నారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహిద్దాం

ఉండి: సమాజంలోని విభిన్న ప్రతిభావంతులు (దివ్యాంగులను) గుర్తించి వారిని పోత్సహిద్దామని తహసీల్దార్ కె.నాగార్జున అన్నారు. మంగళవారం ఉండి భవితా కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎస్.రవీంద్ర మాట్లాడుతూ దివ్యాంగుల్లోని ప్రతిభను గుర్తించి వారిని పోత్సహిస్తే వారు సామాన్యుల కంటే మరింతగా ప్రతిభ కనబరుస్తారన్నారు. అనంతరం దివ్యాంగులకు ఆటలపోటీలు నిర్వహించి లయన్స్‌క్లబ్ ఆర్థిక సహాయంతో బహుమతులు అందజేశారు. సర్పంచ్ కమతం సౌజన్యబెనర్జీ, ఎంపీటీసీ కునుకు రమాదేవి, అడగాల వరప్రసాద్, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు, ఎంఈవో వినాయకుడు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ వై.రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చూపాలి

పాలకోడేరు: దివ్యాంగుల పట్ల జాలి కాదు మానవత్వాన్ని చూపాలని కోరుకొల్లు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రమణరాజు అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా హైస్కూల్ భవిత సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో అంగనవాడి వర్కర్లు చంద్రకళ, ఐఈఆర్‌డీఎస్ ఝాన్సీరాణి, జానకి, సీఆర్పీలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



పాలకోడేరు: సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ఎం రమణరాజు

వినియోగదారులకు చేరువగా కొత్త గ్యాస్ ఏజెన్సీలు

ఆకివీడు: గ్యాస్ వినియోగదారులకు మరింత చేరువయ్యేందుకే కొత్త గ్యాస్ ఏజెన్సీలను ఏర్పాటు చేస్తున్నామని ఉమ్మడి హెచ్‌పీ గ్యాస్ కంపెనీ డీజీఎం శ్రీనివాస్ అన్నారు. స్థానిక సిద్ధాపురం రోడ్డులో మంగళవారం ఓం జీఎస్‌టీ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్యాస్ వినియోగదారులకు అందుబాటులో సిలిండర్లు ఉండే విధంగా చర్యలు చేపట్టామన్నారు. వినియోగదారులకు ఓర్పు, సహనంతో సేవలందించాలని ఆయన సూచించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 207 మంది డీలర్ల ద్వారా 38 లక్షల గ్యాస్ కనెక్షన్లకు గ్యాస్ సరఫరా చేస్తున్నామన్నారు. కొత్తగా 42 ఏజెన్సీలను ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు, డీటీ ఫరూక్, ఏరియా సేల్స్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, నేరెళ్ల పెదబాబు, మోటుపల్లి సుబ్బారావు, కొట్ట మాణిక్యాలరావు, వినియోగదారుల సమాఖ్య అధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య, డీలర్ కంభంపాటి వల్లీ త్రినాథ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



నూతన గ్యాస్ ఏజెన్సీని ప్రారంభిస్తున్న డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రత్తి శ్రీనివాస్

అసిస్టివ్ టెక్నాలజీ ల్యాబ్ అభినందనీయం

భీమవరం: వికలాంగులకు ఉపయోగపడే విధంగా భీమవరం విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టివ్ టెక్నాలజీ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రముఖ నేత్రవైద్యుడు, యువీఎస్ మెమోరియల్ టెస్ట్ సెంటర్ ఫర్ విజువల్లి ఛాలెంజ్ వ్యవస్థాపకుడు డాక్టర్ యూవీ రమణరాజు అన్నారు. మంగళవారం విష్ణు ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అసిస్టివ్ టెక్నాలజీ ల్యాబ్‌లో విద్యార్థులు చేపడుతున్న వివిధ పరిశోధనలు, ల్యాబ్‌లో వికలాంగులకు చేయూతనిచ్చే పరికరాలను తయారు చేయడం ప్రశంసనీయమన్నారు. అనంతరం అసిస్టివ్ టెక్నాలజీ ల్యాబ్‌లో విద్యార్థులు తయారు చేసిన వివిధరకాల పరికాలను ప్రదర్శించి ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మంగం వేణు, వైస్ ప్రిన్సిపల్ ఎం.శ్రీలక్ష్మి, అసిస్టివ్ టెక్నాలజీ ల్యాబ్ కోఆర్డినేటర్ గాయత్రిశర్మన్, ఈసీఈ విభాగాధిపతి కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



భీమవరం విష్ణు కళాశాల విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న దృశ్యం

సీసీ కెమెరాల ఆవశ్యకత గుర్తించాలి

ఉండి: సీసీ కెమెరాల అవశ్యకతను అందరూ గుర్తించాలని ఉండి ఎస్సై ఎండీ నసీరుల్లా అన్నారు. మండలంలో చర్చిలు, ఆలయాలు, మసీదుల ప్రతినిధులతో ఉండిలో ఎస్సై మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలు, చర్చిలు, మసీదుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. దొంగతనాలు, అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం లేకుండా ఉండాలంటే సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరన్నారు. అందుకే స్వచ్ఛందంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు అందరూ ప్రయత్నించాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల ఎక్కడా ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తవని తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై నసీరుల్లా

ప్రతి విద్యార్థికీ వైద్య పరీక్షలు నిర్వహించాలి

పాలకొల్లు అర్బన్: ప్రతి విద్యార్థికీ ఆరోగ్యపరంగా అన్ని రకాల పరీక్షలు నిర్వహించి ఆన్‌లైన్ చేయాలని రాష్ట్రీయ బాల సురక్ష జిల్లా కోఆర్డినేటర్ డా.భావన కోరారు. మండలంలోని లంకలకోడేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నిర్వహిస్తున్న వైద్య పరీక్షలను డా.భావన పరిశీలించారు. విద్యార్థులకు ఆరోగ్య సమస్యలను బట్టి పరీక్షలు నిర్వ హించి అవసరమైన వారికి ప్రత్యేక వైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

ఆరు నుంచి రెవెన్యూ సదస్సులు

ఆకివీడు: ఈ నెల ఆరో తేదీ నుంచి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. గ్రామాల్లో భూములకు సంబంధించిన సమస్యలు, పట్టాదారు పాస్ పుస్తకాలు, సర్వే, టైటిల్‌డీడ్, రైతు సంఘాల వినతులు స్వీకరించి, ప్రజల వినతులను పరిష్కరిస్తామన్నారు. జనవరి 8వ తేదీ వరకూ సదస్సులు జరుగుతాయని తహసీల్దార్ వివరించారు.

లోపాలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం: ధాన్యం కొనుగోళ్లలో ఏ విధమైన లోటుపాట్లు లేకుండా త్వరితిగతన పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి జిల్లాలోని రెవెన్యూ సిబ్బందితో ధాన్యం కొనుగోళ్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు జిల్లాలో 248 రైతు సేవా కేంద్రాల ద్వారా 1.72 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యంను కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతు ఖాతాలో డబ్బులు ప్రభుత్వం జమ చేస్తుందని అన్నారు. దీనికి సంబంధించి రూ.390 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉండగా రూ.383 కోట్లు రైతులు ఖాతాల్లో జమ చేశామని అన్నారు. ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని మండల స్థాయి అధికారులు ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ మొగలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసి రెడ్డి, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ టి.శివరాం ప్రసాద్, డీఎస్‌ఓ ఎన్. సరోజ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వి.రెడ్డయ్య

పాలకోడేరు: కిశోర్ బాలికలకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో వీరమల్లు రెడ్డియ్య అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన కిశోర్ వికాసం శిక్షణా కార్యక్రమాలను ఎంపీడీఓ ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఐసీడీఎస్ సీడీపీఓ వాణీ విజయరత్నం మాట్లాడుతూ కిశోర బాలికలకు బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, బాలల అక్రమ రవాణా, లైంగిక వేధింపుల గురించి అంగన్‌వాడీ వర్కర్లు వివరించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు స్వర్ణ నిరంజని మాట్లాడుతూ బాలికలు ఎదుర్కొనే పౌష్టికాహారం, బహిష్టు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించాలని ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ వర్కర్లు, ఎంపీహెచ్‌ఓ, ఏఎన్ఎంలకు సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మహిళా పోలీసులు వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ వర్కర్లు, లెక్చరర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

మొగల్తూరు: ఈ నెల 5న నిర్వహించే ఎమ్మెల్సీ ఉపాధ్యాయ ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ కె.రాజకిశోర్ మంగళవారం విలేకరులకు తెలిపారు. మండలంలో సుమారు 87 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా వీరిలో మహిళలు 21 మంది, పురుష ఉపాధ్యాయులు 66 మంది ఉన్నారన్నారు. మొగల్తూరు పెన్మత్స రంగరాజు ఉన్నత పాఠశాలలోని 116వ పోలింగ్ స్టేషన్‌లో ఓట్లు వేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సిబ్బందిని కూడా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించామన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



పీహెచ్‌సీ రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు

ఆకివీడు: మండలంలోని పెదకాపురంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఇద్దరు వైద్యులకుగాను ఒక వైద్యుడు మాత్రమే విధులు నిర్వర్తించడాన్ని ఆయన గుర్తించారు. ఆన్లైన్‌లో తంబు వేసి, అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేయలేదని తహసీల్దార్ గుర్తించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల రిజిస్టర్‌ను, మందులను ఆయన తనిఖీ చేశారు.

బెదిరింపులపై ఫిర్యాదు

భీమవరం: తన కుటుంబంపై అసత్యవార్తలు ప్రచారం చేస్తూ న్యూడ్ ఫోటోలను సోషల్ మీడియాలో పెట్టిన వ్యక్తులతో మాట్లాడడానికి వెళ్లగా చంపుతామని బెదిరించినట్లు భీమవరం పట్టణానికి చెందిన గూడూరి మనోజ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మనోజ్ కుమార్‌తో తణుకు పట్టణానికి చెందిన శిరీషకు వివాహమైంది. అయితే 2019లో మనస్పర్ధలతో విడిపోయారు. 2024 ఏప్రిల్ నెలలో శిరీష, గుత్తుల వెంకటేశ్వరరావు మనోజ్ కుమార్ కుటుంబంపై న్యూడ్ ఫోటోలను సోషల్ మీడియాలో పెట్టడంతో దానిపై మాట్లాడానికి తణుకు వెళ్లగా శిరీష, వెంకటేశ్వరరావు అసభ్య పదజాలంతో దూషించి చంపుతామని బెదిరించారు. ఈ సమస్యను పెద్దల్లో పెట్టినప్పటికీ పరిష్కారం కాకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

బెల్ట్ షాపులపై దాడి

నరసాపురం రూరల్: నరసాపురం ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్ పరిధిలోని మొగల్తూరులో బెల్టు షాపులు నిర్వహిస్తున్న ఇరువురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ రాంబాబు తెలిపారు. మంగళవారం మొగల్తూరు మండలంలోని పేరుపాలెం గ్రామంలో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న అడబాల వెంకటేశ్వరరావు, మొగల్తూరులో మోటుపల్లి నాగేశ్వరరావులను అదుపులోకి తీసుకుని వారిని మొగల్తూరు తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశామన్నారు. వీరి నుంచి 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో సీఐ రాంబాబుతోపాటు జిల్లా టాస్క్ ఫోర్స్ ఎస్సై రమాదేవి, ఎస్సైలు ఖాసిం, జైన్ లబిన్ పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: పెనుగొండలో బెల్ట్ షాపులు నిర్వహిస్తూ పట్టుబడిన ముగ్గురు వ్యక్తుల నుంచి 29 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తణుకు ఎక్సైజ్ సీఐ ఎస్.మణికంఠ రెడ్డి తెలిపారు. మంగళవారం నిర్వహించిన దాడుల్లో ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేయడంతో పాటు, వారి వద్ద నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ దాడుల్లో ఎస్సై బి.లక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాస్, వై.శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.